జోరుగా రబీ.. రైతుల బిజీ..

- ఉత్సాహంగా దాళ్వా సాగు
- పుష్కలంగా సాగునీరు
- ప్రభుత్వ ప్రోత్సాహంపై రైతుల హర్షం

మధురపూడి: మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో రబీ వరిసాగు ఆశాజనకంగా ఉంది. ఖరీఫ్ సీజన్ పూర్తవ్వడంతో రైతన్నలు రబీ పనులు మొదలు పెట్టారు. వరిలో ఎంటీయూ 1,156, ఆర్ఎస్ఆర్ 15,048, ఎంటీయూ 1,121 తదితర రకాలు సాగు చేశారు. తూర్పుగోదావరి జిల్లాలోని 19 మండలాల్లో 56,433 హెక్టార్ల సాధారణ విస్తీర్ణం కాగా, 1,709 హెక్టార్ల విస్తీర్ణంలో వరి నాట్లు పడ్డాయి. రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో 18,240 హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా, 2,440 హెక్టార్ల విస్తీర్ణంలో వరి నాట్లు వేశారు.

సాగుకు సన్నద్ధం

రబీసాగుకు అన్నదాతలు సన్నద్ధమయ్యారు. దీనిలో భాగంగా నారుమడులు వేశారు. కోరుకొండ మండలంలోని పలు ప్రాంతాల్లో వరినాట్లు జరుగుతున్నాయి. వ్యవసాయ శాఖాధికారులు సమయానికి అనుగుణంగా సూచనలు, మెళకువలు తెలియజేస్తున్నారు. దీనిలో భాగంగా ఆర్‌బీకేల ప్రాతిపదికగా అవగాహన తరగతులు నిర్వహించారు. దాళ్వా పంటకు అనుగుణంగా ఉండే రకాలను రైతులు ఎంపిక చేసుకున్నారు. వాతావరణానికి అనుగుణంగా ఎంటీయూ 1,156, ఆర్ఎస్ఆర్ 15,048, ఎంటీయూ 1,121 తదితర రకాలను సాగుచేస్తున్నారు.


కణుపూరులో రబీ వరినాట్లు వేస్తున్న కూలీలు

యాజమాన్య పద్ధతులు

మురగదమ్ము చేయడం పొలానికి బలంగా ఉంటుందని వ్యవసాయ శాఖ కోరుకొండ ఏడీఏ బీకే మల్లికార్జునరావు తెలిపారు. వరినాట్ల సందర్భంలో ఆకుచి గుర్లు కత్తిరించి నాటాలని, దీనిద్వారా మొక్క బలంగా ఉంటుందని, వెన్నులు అధికంగా వస్తాయన్నారు. వ్యవసాయ సాగులో యాజమాన్య పద్ధతులను అనుసరించాలని, ప్రధానంగా వరినాట్ల సందర్భంలో ఎకరం విస్తీర్ణంలో 44 మూనలు ఒక స్క్వేర్ మీటర్ చొప్పున నాటాలన్నారు. దీని ద్వారా మొక్క బలపడుతుందని, సాగునీరు మొక్కకు పుష్కలంగా చేరుతుందన్నారు. నత్రజనిని సరిపడేలా వినియోగించాలని, రసాయనిక ఎరువుల వినియోగంలో మెలకువలు పాటించాలని సూచించారు.

సాగునీటికి దిగులు లేదు



సాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకపోవడంతో దాళ్వా సాగులో దిగుబడిని సాధించవచ్చు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా చొరవతో రైతన్నలకు మేలు జరుగుతోంది. అన్నదాతలకు అన్నివిధాలా ప్రభుత్వ సాయమందిస్తోంది.

– గిద్దా సత్యనారాయణ, రైతు, మునగాల

వ్యవసాయానికి ప్రోత్సాహం



వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నకిలీ విత్తనాలు లేకుండా నివారణ చర్యలు చేపట్టింది. ఆర్‌బీకేల ద్వారా ఎరువులను అందజేస్తోంది. గిట్టుబాటు ధర అందివ్వడంతో పాటు, రవాణాలో రైతులు ఇబ్బంది పడకుండా చూస్తోంది.

– అడపా కనకరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, రైతు

97 శాతం పింఛన్ల పంపిణీ

బిక్కవోలు: బిక్కవోలు మండలంలో 97 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీవో జేఏ ఝాన్సీ తెలిపారు. మండలంలోని 10,565 ఫించన్లకు గాను 10,284 పింఛన్ల పంపిణీ పూర్తి అయ్యిందని గురువారం ఆమె చెప్పారు. లబ్ధిదారులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఈ నెల 7వ తేదీ వరకూ ఫించన్ పంపిణీ జరుగుతుందన్నారు.

సీపీఎస్ వద్దు ఓపీఎస్ కావాలి

పెదపూడి: పెదపూడిలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సీపీఎస్ వద్దని, ఓపీఎస్ మాత్రమే కావాలని నినదిస్తూ 3కే వాక్ గురువారం నిర్వహించారు. మండల విద్యాశాఖ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ నడక సాగించారు.

వైద్యశిబిరం

సీతానగరం: స్థానిక ఉమారామలింగేశ్వరనగర్‌లోని సాయి ఫిజియోథెరపీ, డయోగ్నోస్టిక్ సెంటర్‌లో గురువారం సంతానం లేని వారికి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ గోసాల పాండురాజు, గొల్లపల్లి లవకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో విశాఖపట్నం ద్వారకానగర్‌లోని రోషిణి సంతాన సాఫల్య హాస్పటల్ డాక్టర్ సి.రమామణి 40 మందికి వైద్యసేవలు అందించారు.

క్లుప్తంగా

తీర్థపు బిందె బహూకరణ

రంగంపేట: చంద్రేడు కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామికి గ్రామానికి చెందిన జాస్తి పద్మరాజు, కమల దంపతులు తీర్థపు బిందెను బహూకరించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ మాట్లాడుతూ ఉత్సవాలు తదితర ప్రత్యేక రోజుల్లో ఈ బిందె స్వామివారి సేవకు ఉపయోగపడుతుందన్నారు.

మార్మోగిన గోవిందనామ స్మరణ

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో గురువారం గోవిందనామ స్మరణ మార్మోగింది. స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయం నుంచి దేవదాయ, ధర్మదాయశాఖ ఈవో సోమాల శివ, ఆలయ కమిటీ ఛైర్మన్ సలాది వాసు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి సనాతన హిందూ ధర్మ ప్రచార రథం ప్రారంభమైంది. స్వామిని ఎంపీడీవో కె.రమేష్, తహసీల్దార్ ఎస్.సత్యనారాయణరాజు, ఎస్సై కె.శుభశేఖర్, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు, భక్తులు దర్శించుకున్నారు. రాత్రి వాకపల్లి సూరిబాబు ఆధ్వర్యంలో రథం చినకొండేపూడి చేరుకుంది.

సీతారాముడికి లక్ష చామంతులతో పూజ


మెళ్లూరులో సీతారామస్వామికి లక్ష చామంతులతో పూజ చేస్తున్న అర్చకులు

బిక్కవోలు: మండలంలోని మెళ్లూరు గ్రామంలో వెలిసిన సీతారామస్వామికి ఆలయం వద్ద లక్ష చామంతులతో పూజ చేశారు. గురువారం 15 మంది రుత్వికులు వేద మంత్రాలతో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొమ్మన ఆనంద, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాయిబాబాకు పూజలు


బాబా సన్నిధిలో సీఐ దంపతులు

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో సీఐ కాశీ విశ్వనాథ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్న హారతి అనంతరం సాయిబాబా సన్నిధిలో అన్నసమారాధన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన ఉండాలన్నారు. అదే మనల్ని వెన్నంటి ఉంటూ సన్మార్గంలో పయనింపజేస్తుందన్నారు.

ఆయాలకు దుస్తుల పంపిణీ

బిక్కవోలు: మండలంలోని పందలపాక ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయురాలు సీతారత్నం సమకూర్చిన దుస్తులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్‌వీ సోమిరెడ్డి చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో కేవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ కటౌట్‌తో పింఛన్ల పంపిణీ


ఉండేశ్వరపురంలో జగన్ కటౌట్‌తో పింఛన్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఈశ్వరరావు

సీతానగరం: మండలంలోని ఉండేశ్వరపురంలో సర్పంచ్ మాకాల ఈశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం వినూత్నంగా పింఛన్లు పంపిణీ చేశారు. సీఎం జగన్ కటౌట్‌ను లబ్ధిదారుల వద్దకు తీసుకువెళ్లి పింఛన్ సొమ్ములు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్.. అంచెలంచెలుగా పింఛన్ పెంచుతున్నారన్నారు. అలాగే చినకొండేపూడిలో సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, ఉపసర్పంచ్ సత్తిపండురాజు, పార్టీ నాయకులు ముదునూరి రామకృష్ణంరాజు, యర్రంశెట్టి బాబులు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోకవరం: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై ఎంవీఆర్ రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన మధువీటి లక్ష్మీనారాయణ సాయిరాం దేవ్ (56) గత కొంత కాలంగా మోహనాపురం గ్రామంలో వ్యవసాయం చేస్తున్నాడు. వ్యవసాయంలో పెట్టిన పెట్టుబడులు తిరిగిరాకపోవడంతో డిసెంబర్ 24న ఇంటి వద్దే పురుగు మందు తాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య నిమిత్తం రాజమహేంద్రవరంలోనే ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

స్థలం పరిశీలించిన జాయింట్ కలెక్టర్


పెద్దాడలో ఇళ్ల స్థలాల లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా

పెదపూడి: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలాక్కియా అన్నారు. ఆమె పెద్దాడలోని జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని 6.76 ఎకరాల స్థలాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థలం కొత్తగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి ఇచ్చేందుకు అనుకూలంగా ఉందన్నారు. నివేదికలు పరిశీలించి పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వడానికి కృషి చేస్తామన్నారు. పర్యటనలో తహసీల్దార్ టి.సుభాష్, ఎంపీడీఓ పి.విజయభాస్కర్, గ్రామ సర్పంచి డొకుబుర్ర మీనాక్షి, వీఆర్వో ప్రసాద్, సచివాలయం కార్యదర్శి త్రినాథ్ తదితరులు ఉన్నారు.

జగన్ పాలనపై గడపగడపలో ఆనందం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- గాదరాడలో గడపగడపకూ మన ప్రభుత్వం


గాదరాడలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనపై గడపగడపలో సంతోషం వ్యక్తమవుతోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం గాదరాడలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకూ వెళ్లి సమస్యలు, సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ఇళ్ల స్థలాలు, తాగునీరు, మురుగు కాలువల నిర్మాణంపై ఎమ్మెల్యే రాజాకు వివరించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలన్న లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని, దానిలో భాగంగా గాదరాడకు స్థల సేకరణ జరుపుతున్నామన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం జరిపినట్టు తెలిపారు. మురుగునీటి కాలువలు నిర్మిస్తామన్నారు. గురువారం సాయంత్రం 6 గంటలకు గ్రామంలోని పెద్దవీధి రామాలయంలో శ్రీరాముని దర్శించుకున్న అనంతరం రాజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుంకర, చిక్కిరెడ్డి, చీర్ల వారి వీధుల్లో రాత్రి 10 గంటల వరకూ సుమారు 150 గడపలు తిరిగారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ మండల కోకన్వీనర్ గణేశుల పోసి, మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, పార్టీ నాయకులు హరిబోలు చినబాబు, పాలెం నాగవిష్ణు, తోరాట శ్రీను, చీర్ల శివ, శ్రీను పాల్గొన్నారు.

'నన్నయ'లో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఇన్ఫో లాబ్ సొల్యూషన్స్ సహకారంతో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేశామని వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు తెలిపారు. రాష్ట్రంలో యూనివర్సిటీల స్థాయిలో తొలిసారిగా ఇంక్యుబేషన్ సెంటర్ నన్నయలోనే ఏర్పాటవుతోందన్నారు. యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తొలిరోజే 120 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, 16 మందిని శిక్షణ ఇచ్చేందుకు ఎంపిక చేశారన్నారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాలు అందజేయాల్సి ఉందన్నారు. క్లిఫ్ బేస్ట్ సాఫ్ట్‌వేర్స్, లైవ్ ప్రాజెక్టులు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గోదావరి జిల్లాలకు తలమానికంగా దీనిని అభివృద్ధిపర్చాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, డీన్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఓఎస్డీ ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.రమణేశ్వరి, డాక్టర్ వి.పెర్సిస్ పాల్గొన్నారు.

'నన్నయ'లో స్టూడెంట్ చాప్టర్

రాజానగరం: స్టూడెంట్ చాప్టర్‌తో బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్టూడెంట్ చాప్టర్ ఆఫ్ ఇండియన్ జియోఫిజికల్ యూనియన్‌ని గురువారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. సీఎస్ఆర్, ఎన్‌జీఆర్ఐ మాజీ డైరెక్టర్ వీఎం తివారీ, ఇండియన్ జియోఫిజికల్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్, భూభౌతిక విజ్ఞాన శాస్త్ర చీఫ్ సైంటిస్టు డాక్టర్ బీపీకే పాత్రో మాట్లాడుతూ దీని ద్వారా యూనివర్సిటీలో జియోసైన్స్ విద్యార్థులకు మంచి అవకాశాలు లభిస్తాయన్నారు.

ప్రతిభను వెలికితీయాలి

పెదపూడి: గ్రామీణుల్లో ఉన్న ప్రతిభ, సృజనాత్మకతను వెలికి తీయాలని పెదపూడి ఎస్ఐ పి.వాసు అన్నారు. పెదపూడి సచివాలయం–2 పోలీస్‌స్టేషన్ వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు, యువత, మహిళలకు ముగ్గులు, కుర్చీలాట, స్పీడ్‌వాక్ తదితర పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలను ఎంపిక చేసి ఎస్ఐ వాసు, సర్పంచ్ కలవల కృష్ణమూర్తి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పెదపూడి గ్రామ సచివాలయ కార్యదర్శి మన్యం శ్రీనివాసుచౌదరి, సీహెచ్ సుధారాణి, జి.సునీత తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

సీతానగరం: స్థానిక సీపీఐ ఎంఎల్ కార్యాలయంలో అనపర్తి నియోజకవర్గం రంగంపేట మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు గురువారం తెలిపారు. అధ్యక్షుడిగా మోత చిన్నిబాబు ఎన్నికయ్యారన్నారు.

పింఛన్ల పెంపుతో ముందే సంక్రాంతి

- పార్టీ బలోపేతానికి కమిటీలు
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


బూరుగుపూడిలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: పింఛన్ల పెంపుతో సంక్రాంతి పండగ ముందే వచ్చిందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి సచివాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాడాల, బూరుగుపూడి, మధురపూడి, గుమ్ములూరు, నిడిగట్ల గ్రామాల కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు సన్నద్ధం కావాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బూరుగుపూడికి చెందిన కడితెల శ్రీను మరణించిన నేపథ్యంలో అతడి భార్య యశోదకు రూ.లక్ష బీమా నమూనా చెక్కు అందజేశారు. అనంతరం పలువురికి పింఛన్లు పంపిణీ చేశారు. ఇటీవల మృతి చెందిన ఏడిద పైడియ్య కుమారుడు పండుకు జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ద్వారా నిత్యావసరాలు అందజేశారు. గాదరాడలోని చీర్ల రాంబాబు నివాస గృహంలో వివిధ గ్రామాల నాయకులతో కమిటీలు చేశారు.

నేరుగా అర్హులకే పథకాలు

జక్కంపూడి రాజా విలేకరులతో మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను నేరుగా అందజేస్తోందన్నారు. రాజకీయాలు, కులమతాలకు అతీతంగా పారదర్శకంగా అర్హుల ఎంపిక జరుగుతోందన్నారు. వలంటీర్ల వ్యవస్థ సేవకు నిదర్శనంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికలకు శ్రేణులను సిద్ధం చేస్తున్నట్టు, దానిలో భాగంగా పార్టీ గ్రామ శాఖ, గ్రామ సచివాలయ, బూత్ కమిటీల ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ నక్కా రాంబాబు, కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ కోరుకొండ మండలం కో కన్వీనర్ గణేశుల పోసియ్య, వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ క్రొవ్విడి సత్రాజు, పార్టీ నాయకులు కొండపల్లి దుర్గారావు, కళ్యాణం రాంబాబు పాల్గొన్నారు.

గడప వద్దకే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- దుప్పలపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం


దుప్పలపూడిలో వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల్ని లబ్ధిదారుల ఇంటి ముంగిటకే అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని దుప్పలపూడిలో రెండో రోజు గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికై చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాల అమలు ద్వారా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. సంక్షేమ పథకాలతో ఒక్కో ఇంటికి రూ.లక్షల్లో మేలు చేకూరిందని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ఇప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. సంక్షేమ ఫలాలు పెద్ద ఎత్తున అందుకుంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అన్ని సందర్భాల్లోనూ ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక

దుప్పలపూడిలో నిర్వహించిన గడప గడపకూ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. గత పంచాయతీ ఎన్నికల్లో పంచాయితీ వార్డు సభ్యుడుగా ఇండిపెండెంట్‌గా పోటీ చేసి విజయం సాధించిన మండెల్లి ఆని నేతృత్వంలో టీడీపీకి చెందిన వజ్రపు మహేష్, వరిగిటి రాజేష్, నందికోళ్ల పెద గంగరాజు, నందికోళ్ల సుధాకర్, మండెల్లి చిన్నబాబులతో పాటు మరికొందరు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పారదర్శక పాలన, చేపట్టిన సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారందరికీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లమిల్లి సావిత్రి అబ్బన్నరెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ కొండా ప్రేమలత సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ చిత్సారపు బాపిరాజు, పంచాయితీ కార్యదర్శి కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి

- కాకినాడ జిల్లా పంచాయితీ అధికారి ఆర్.విక్టర్


పెదపూడిలో సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీఓ విక్టర్

పెదపూడి: గ్రామ సచివాలయాల్లో పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ ఆదేశించారు. గురువారం పెదపూడి సచివాలయాన్ని సందర్శించిన ఆయన కార్యాలయ రికార్డులు పరిశీలించి సేవలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రజలకు చేర్చేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. సచివాలయం నుంచి అందిస్తున్న సుమారు 540 రకాల సేవలను బాధ్యతగా అమలు చేయాలని సూచించారు. సచివాలయం రికార్డులన్నీ ఎప్పటికప్పుడు సక్రమంగా అప్‌డేట్ చేయాలని చెప్పారు. సమావేశంలో ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి, సచివాలయం కార్యదర్శులు మన్యం శ్రీనివాస్ చౌదరి, ఉమామహేశ్వరరావు, త్రినాథ్, ఎస్‌వీ స్వామి, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నిర్వీర్యం


విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ సీఐ వెంకటలక్ష్మి

రంగంపేట: మాదకద్రవ్యాల కారణంగా జీవితాలు నిర్వీర్యమవుతాయని, యువత అటువంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్ఈబీ సీఐ వెంకటలక్ష్మి సూచించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా రంగంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా ఉన్నత పాఠశాలల్లో గురువారం ఆమె విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు ఎవరైనా విక్రయించినా, వాడుతున్నా ఆ సమాచారాన్ని వెంటనే 14500 అనే టోల్‌ఫ్రీ నెంబరుకు తెలియజేయాలని కోరారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

రంగంపేటలో గురువారం నిర్వహించిన దాడుల్లో 40 లీటర్ల సారాతో పెద్దిశెట్టి సాంబయ్య అనే వ్యక్తిని అరెస్ట్ చేశామని ఎస్ఈబీ సీఐ వెంకటలక్ష్మి తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: జి.మామిడాడ ఫ్యామిలీ హెల్త్ క్లబ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం ఆవిష్కరించారు. అనపర్తిలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లయన్ బ్రహ్మానందరెడ్డి, ముఖ్య సలహాదారుడు లయన్ మండ రాజారెడ్డి, కార్యవర్గ సభ్యులు అచ్చిబాబు, ద్వారంపూడి వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి 12 వరకూ గడపగడపకూ వెళ్లండి

రాజానగరం: ప్రభుత్వ పథకాలు పొందడంలో ఎవరికైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే తెలుసుకుని, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దృష్టికి తీసుకువెళ్లాలని ఎంపీపీ మందారపు సీతారత్నం అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాలులో గురువారం మండలంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇంతవరకు మండలంలో కొన్ని గ్రామాలలో గడపగడపకూ కార్యక్రమం జరిగిందని, ఆ సమయంలో ప్రజలు వివిధ సమస్యలపై విన్నపాలు అందజేశారని ఎంపీడీఓ బి.రామారావు తెలిపారు. ఆ తరువాత కూడా ఏమైనా సమస్యలుంటే తెలుసుకోవాలన్నారు. ఇందుకుగాను ఎమ్మెల్యే ఆదేశాలను అనుసరించి ఈనెల 9 నుంచి 12 వరకు మండలంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గడపగడపకూ పర్యటించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, వైఎస్సార్ సీపీ కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, అడబాల చినబాబు, వేమగిరి కృష్ణ, పంపన శ్రీను, సర్పంచ్ కె.ప్రసాద్, ఉపసర్పంచ్ కొల్లి వీర్రాజు పాల్గొన్నారు.

చంద్రేడులో కొత్త పింఛన్ల పంపిణీ

రంగంపేట: చంద్రేడులోని సచివాలయంలో కొత్తగా మంజూరైన వైఎస్సార్ పింఛన్లను 15 మంది లబ్ధిదారులకు గ్రామ సర్పంచ్ జాస్తి వెంకట పద్మావతి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అర్హుల్ని గుర్తించి నూతన పింఛన్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జాస్తి సత్తిబాబు, కంటిపూడి జెమీ, కె.రామదేవుడు, మద్దిపూడి వెంకటేష్, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ జానీ మహ్మద్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ క్యాలెండర్ ఆవిష్కరణ

రంగంపేట: ఎస్ఎఫ్ఐ జిల్లా క్యాలెండర్‌ను గురువారం తహసీల్దార్ వాకాడ అమ్మజీ, ఎస్ఐ టి.రామకృష్ణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తదితరులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం విద్యారంగంలో వచ్చే సమస్యలపై నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు మహాలక్ష్మి, అపురూప్, సహాయ కార్యదర్శి కె.నాని, సభ్యులు శ్రీలక్ష్మి, సాయి, పవన్, మణికంఠ పాల్గొన్నారు.